


'పొదుపు చేయండి-అది మీ కర్తవ్యం'

అని పెద్ద అక్షరాల్తో కొట్టొస్తున్నట్టు చదువుతున్న పత్రికలో కనపడగానే రంగనాధం ఆలోచనన్లో పడ్డాడు. ఈ ప్రకటనలో ఎంతో కొంత న్యాయం వుందనిపించింది. కళ్ళజోడు తీసి లాల్చీ కొసతో తుడిచి మొహానికి తగిలించుకో బోతూ - సిగరెట్టు పెదిమలకు తార్చి - అగ్గిపెట్టె లోపలి సొరుగు తలక్రిందుగా వుండటంవలన, లాగ్గానే పుల్లలు బడి వదిలిన ఆకతాయి పిల్లల్లా నేలమీదకు దూకాయి. పుల్లలకోసం వంగిన రంగనాధం కళ్ళజోడు ముక్కుమీంచి జారి భూమిని ముద్దెట్టుకుంది. పుల్లలేరటం కోసం కళ్ళజోడు అద్దం బద్దలుకొట్టుకున్నాను గదా అని రవంత చింత చోటు చేసుకుంది. రంగనాధం తాపీగా అగ్గిపెట్టెలోకి ఒక పుల్లకూడా బీరు పోనివ్వకుండా సర్ది - సిగరెట్ వెలిగించుకుని తాను పొదుపు ఉద్యమం తలపెట్టిన ఉత్తరక్షణాన్నే విరిగిన కళ్ళజోడు అద్దం వంక దీనంగా చూశాడు. అగ్గిపుల్లకోసం వంగటం వలన నలభై రూపాయల ఖర్చు తగులుకుందని అతను ఫీలయ్యాడు. సిగరెట్ ముందు కాల్చుకుని ఆ తర్వాత అగ్గిపుల్లల వేస్టు గురించి ఆలోచించి వుంటే కళ్ళజోడు నష్టం జరిగేది కాదు. ఆలోచన్ల క్రమంలో తప్పు వుంది కాని అగ్గిపెట్టెది ఏవీ తప్పుకాదు అని తోచింది. మరుక్షణంలో అగ్గిపెట్టెలో పుల్లల సొరుగును తలక్రిందులాపెట్టి అమ్మిన కంపెనీ మీద డామేజిన్‌కి కేసు వేయాలన్నంత కోపం వచ్చింది. ఆ కంపెనీ నిర్లక్ష్యం వలన రంగనాథానికి నలభై రూపాయల అవదం అంటుకుంది. ఈ విధంగా తల క్రిందులుగా వున్న అగ్గిపెట్టెల వలన ఇంకెంతమందికి ఇంకెన్ని అనర్థాలు జరుగుతాయో అని భయం వేసింది.

మళ్ళీ అంతరాత్మ ప్రబోధంలా 'పొదుపు చేయండి అది మీకర్తవ్యం' అని ఎదురుగ్గా వున్న అద్దంలో రంగనాధం అంతరాత్మ పగిలిన కళ్ళద్దాలతో లాల్చీ పంచెతో దర్శన మిచ్చి ప్రబోధించింది. అంతరాత్మకు లాల్చీ పంచ కళ్ళజోడు వుంటాయా అనే అనుమానం కలిగి - వెధవ అనుమానాల్తోనే జీవితం వేస్టయే లాగుందని రంగనాధం విసుక్కున్నాడు. పగిలిన కళ్లద్దాలతో పత్రిక చదవడం అసంభవం గనుక పత్రిక నేలమీదకు జారవిడిచి మీదికి చూశాడు. పైనచూరున వేళ్లాడుతూ బూజులు కనిపించాయి. బూజు దులపడానికి వుద్యుక్తురాలైన ఒక మహిళ కుచ్చెళ్లు ఎగ్గట్టి తలకు విడస పెట్టుకుని చేతిలో పెద్ద బూజు కర్రతో వచ్చింది. ఈమెను ఎక్కడో చూసినట్లుందనుకుని 'ఎవరు నువ్వ'న్నాడు రంగనాధం.

'కళ్లు కనపడ్డంలేదా'అని ఆ సుందరి గంయ్యమంది. నిజంగా సుందరే- తన భార్య - ఎవరో పనిమనిషనుకుని తొందరపడ్డాడు రంగనాధం. క్షమించు అనబోయి ఆ ముక్క పైకి రాక 'ఛీ ఛీ' అన్నాడు. 'ఛి ఛి' అంటున్నారేవిటి? ఇదోటా, ముందిక్కడనుంచి లేచి అవతలికెళ్లండి' అని ఆవిడ శ్రావణ శుక్ర

హారం దులుపులు బూజుల ఆర్భాటంలో పతిదేవుడ్ని గసురుకుంది.

రంగనాథం ఇవతలకొచ్చి 'కళ్లజోడు పగిలిందే' అని మూలిగాడు. 'సంతోషించాం' అని ఆవిడ నడుం బిగించి అద్దాలూ తలుపులూ కిటికీలూ దులపటం ప్రారంభించింది. అలా ఓ చెంప దులుపుతూనే - బజారు చేసుకురండి అని ఓ లిస్టిచ్చి చెప్పినవి మళ్లీ మళ్లీ చెప్పి చెప్పనివి చెప్పకుండా వదిలేసి బయటకు తోలింది.

రంగనాథానికి ఆ లిస్టు చూడగానే అది ఎవరో దయ్యపు చేత్తో రాసినట్టు - అగరొత్తులు అగరొత్తులు, అర్టిపళ్లు అర్టిపళ్లు, కొబ్బరికాయలు కొబ్బరికాయలు అని రాసినవే రెండేసి మార్లు రాసినట్టు కనిపించి 'ఇవన్నీ మళ్లీమళ్లీ ఇన్నిసార్లు ఎందుకు రాశావే' అని ఎగిరిపడ్డాడు.

'సరిగ్గానే రాశా - మళ్లీ చూడండి' అంది ఆవిడ బూజుకర్రకేసి శ్రద్ధగా, తన వైపు అశ్రద్ధగా చూస్తూ - రంగనాథం 'సర్లె' ఎందుకో అన్నీ డబుల్‌గా కనిపిస్తున్నా యనుకుని సర్దుకున్నాడు. ఇల్లు దాటాకకూడా గేటు, మెట్లు, రోడ్డు అన్నీ వంకర టింకరగాను అడ్డదిడ్డంగానూ, ఎదురవుతున్న మనుషులు రెండు మూడు తలకాయల్తోనూ కనిపించసాగారు.

చెట్లు ముందుకు వాల్తున్నాయి. వచ్చేపోయే కార్లకు ఇటు రెండు అటు రెండు నాల్గేసి చక్రాలున్నాయ్. సైకిళ్లమీద ముందుకు పోతున్నవాళ్లు ఒక్కొకరు రెండేసి సైకిళ్లమీద ఒకసారే ఫీట్సు చేస్తున్నట్లున్నారు. వీధుల్లో ఇళ్లు ముందుకు వచ్చి కదుల్తున్నాయ్. ఒక గేదెకు నాలుగు కొమ్ములు రెండు తోకలు కనిపించాయ్. ఇహ రోడ్డు - పల్లంగావున్న చోట ఎత్తుగాను ఎత్తుగా వున్న చోట పల్లంగానూ వుంది. తనను పరాభవించడానికి లోకం అంతా వైఖరి మార్చుకున్నట్లనిపించింది రంగనాథానికి.

ఇహ - బజార్లో -

అంతా మాయాబజారే!

రంగనాథానికో రూలుంది. ఏ పని ప్రారంభించాలన్నా విఘ్నేశ్వరుడికి మొక్కుకున్నట్లు - బజార్లో కడుగు పెట్టగానే మొట్టమొదట కాఫీహోటలు కెళ్లాలి. అలా కాఫీ హోటలు మొహం చూడకుండా యకాయకీ ఏపన్లోనూ జొరబడ్డానికి మనసు వప్పదు. అంచేత ముందుగా లక్ష్మీవిలాస్ కాఫీ క్లబ్బులోకి దూరాడు. కాఫీ హోటలు కిక్కిరిసిపోయింది. అయిపోయినవా శ్లైవరేనా చేతులు కడుగుతున్నారేమో చూసి వెనక చేతులు కట్టుకుని నిలబడదాం అనుకున్నాడు. అతనికి తింటున్న మనుషుల్ని చూస్తే అసహ్యం వేసింది. అంతా రెండు చేతుల్తో తింటున్నారు. అందులో ఒకతనికి అరచేతికి పదివేళ్లున్నాయి. పదివేళ్లతో దోసెను చీలుస్తున్నాడు. ఓచోట సర్వరు కుర్రాడు కాఫీని హిందుస్థానీ కాఫీని సాగదీసినట్లు సాగదీస్తున్నాడు. అంతవరకూ బానే వుంది. కప్పులోంచి గ్లాసులోకి సాగదీసిన కాఫీ రెండు నాల్కల్లాగా రెండుగా గండుపిల్లి మీసాల్లా దూసుకుని వస్తోంది. అది చూడ్డానికే భయంవేసింది. ప్రతి కుర్చీకి అయిదో ఆరో కాళ్లున్నాయి. ఈ హోటలువాడికి బుర్ర తిరిగిందనుకున్నాడు. అనుకుని ఓ కుర్చీలో కూలబడి రెండు ముక్కులు నాలుగు కళ్లున్న ఒక సర్వరుకి ప్లేటిడ్లీ ప్లేటు సాంబారూ, సింగిల్ వడై ఆర్డరిచ్చాడు. వాడితో నాలుగిడ్లీ రెండు వడై రెండు సాంబార్లు ఎందుకు తెచ్చావని పోట్లాడాడు. పక్క కుర్చీలో ఆసామీ కల్పించుకుని అవి ప్లేటిడ్లీ సింగిల్ వడై సాంబారేనని నచ్చచెప్పాక వూరుకున్నాడు. టిఫినయాక ఇలా నాలుగు కళ్లు రెండు ముక్కులు అరచేతికి పదివేళ్లున్న వాళ్లని సర్వర్లుగా ఎందుకు పెట్టుకున్నావని ప్రొప్రయిటరుతో దెబ్బలాడాలనుకున్నాడు. లోకం యింత అవకతవకగా వున్నప్పుడు ఎన్నిటికని మనం కలగజేసుకుని దెబ్బలాడగలం? కంఠశోష! అని మళ్లీ వూరుకున్నాడు. ఇంటిదగ్గర లేని ఆకలి బజారులోకి రాగానే పడగవిప్పింది పక్కవాడు బజ్జీలు తింటూంటే-పొరుగు వాడ్ని చూసి నేర్చుకోవాలనుకుని తనూ బజ్జీలకి ఆర్డరిచ్చాడు. రంగనాథం లెఫ్టిస్టు ఎడమ కంట్లోంచి తన ప్లేట్లోకి చూస్తే నాలుగు బజ్జీలున్నాయి. కుడి కంటితో గమనిస్తే ప్రక్క వాడి ప్లేట్లో ఎనిమిది బజ్జీలున్నాయ్. రంగనాథం అనుమానించాడు. పాతజోకు గుర్తుచేసుకుని 'మీరు హోటలు ప్రొప్రయిటరా' అన్నాడు. 'కాదు నేత్ర వైద్యుడ్ని' అన్నాడతను. 'ఎనిమిది బజ్జీలంటే మీరు హోటలు ప్రొప్రయిటరేమో అనుకున్నా' నన్నాడు రంగనాథం. అతను తన విజిటింగు కార్డిచ్చి, 'సాయంత్రం ఓమాటు మా ఆస్పత్రికి రండి ఉచితం పరీక్ష' అన్నాడు. 'చాలా థాంక్సండి' అని బజ్జీలు తింటున్న పచ్చడి చేత్తో అతనికి షేక్‌హాండిచ్చి - ఆ తర్వాత తన రుమాలు తీసిచ్చాడు చేతులు తుడుచుకోండని.

ఆ కుర్చీలోకి ఒక సైజు మనిషి ఖద్దరులో వచ్చాడు. చిత్రం—ఆ ఆసామీ రెండు కండువాలు ఒకే బుజంమీద వేసుకోడం చూసి రంగనాథానికి నవ్వొచ్చి - నవ్వడం బాగోదని ఆపుకుని - ఆయన చంకలో రెండు పత్రికలున్నట్లు చూసి- ఈయన ఒకే పత్రిక రెండు కాపీలెందుకు కొన్నట్లు అని ఆలోచించి- ఇతగాడికన్నీ డబుల్ సర్వీసు కామోసులే అని వూరుకోలేక - 'రెండు పత్రికలున్నాయ్ ఓటిస్తారా?' అని అడిగాడు. అసలా ఖద్దరు మనిషికి నవ్వబోయి నవ్వాపుకున్న యీ వ్యక్తిని చూస్తేనే చిరాగ్గావుంది. ఇస్తాను, ఇవ్వను అనకుండా, 'పచ్చడి చేత్తో

పత్రిక చదవకూడదండీ' అని హెచ్చరించాడు. రంగనాధం ఆదేమీ పట్టించుకోకుండా మళ్లీ అడగ్గా ఖద్దరు మనిషి పత్రిక తీసి యిచ్చి న్యూసెన్సు వదిలించుకున్నట్టు బోయ్‌ని పిల్చి, టిఫిన్ కార్యక్రమం గురించి ఆర్డరివ్వసాగాడు. రంగనాధం కాఫీ తాగుతూ, పత్రిక ముఖానికి అడ్డంపెట్టుకుని హోటల్లో పైన సీలింగుని పరీక్షించి - తల క్రిందకు దించి గోడకు తగిల్చిన పటాలకేసి శ్రద్ధగా పరీక్షగా చూడ్డం ప్రారంభించాడు. అక్కడేం కనిపించిందో అతను ఆపుకోలేక పుసుక్కున నవ్వేశాడు. ఖద్దరు ఆసామీ కొంచం కంగారుపడి 'ఏమండీ ఏమిటి?' అని కళ్లతో ప్రశ్నించాడు.

'రంగనాధం చెప్పకూడదు లెండి. బాగుండదు. హోటల్లోకి అమ్మాయిలొస్తున్నారు కూడాను' అని కాలేజీ అమ్మాయిలు బిలబిలా రావడం చూసి - ఆపుకోలేక మళ్ళీ నవ్వాడు. అమ్మాయిలంతా ఒక్కసారి ఫ్రీజయి చిరాగ్గా అతనికేసి చూశారు, ఏళ్లొచ్చి కూడా బుద్ధిలేని వాళ్ళను చూసినట్టు.

రంగనాధం కాఫీ తాగి బిల్లు చెల్లిస్తూ మళ్ళీ పుసిక్కున నవ్వాడు. ఆట్టే చిరాకు పడకుండా 'ఎందుకలా నవ్వుతారు' అన్నాడు, రెండు రూపాయల నోటును లోపలకు తోసి రూపాయ నోటు ముందు పెడుతూ.

'అదేవిటి బలేవారే-రెండు రూపాయలెందుకిస్తారూ!' అని రంగనాధం అనేసి-యిచ్చింది తీసుకుని 'ఈహోటల్లో టిఫిన్ చేశాక మనం రెండు రూపాయల నోటిస్తే తిరిగి మనకు రెండు రూపాయల నోట్లు యిచ్చేస్తారు-బానేవుంది' అనుకున్నాడు. ఖద్దరువాలా బయటికొచ్చి 'ఇందాక నన్ను చూసేనా మీరు నవ్వింది' అని గంభీరంగా అడిగాడు. రంగనాధం అతని అజ్ఞానానికి నొచ్చుకుంటూ -



'మీకేసి కాదండీ! గోడనున్న పార్వతీ అమ్మవారి బొమ్మకేసి చూసి.'


'చాల్లెండి. ఆ బొమ్మని నేనీ హోటలు కొచ్చినప్పట్నుంచి గోడమీద చూస్తున్నాను. అందులో నవ్వడానికేం వుంది?'

'మీకేం కనపడలా? అసలిలాటి తెలివి తక్కువ ఆర్టిస్టుల్ని ఎందుకు ప్రోత్సహిస్తారో?' అన్నాడు విచారంగా రంగనాధం.

'అది జర్మన్ ప్రింటండీ బాబూ - రవివర్మది. తెలివి తక్కువ ఆర్టిస్టంటారేవిటి?'

'ఏ వర్మో - అందులో అమ్మవారికి రెండు సున్నాలుండాలి. మూడేశాడు. చచ్చే నవ్వొచ్చింది నాకు.'

ఆ ఖద్దరు ఆసామీ 'పదండి లోపలికెళ్లి చూద్దాం' అన్నాడు రంగనాధం 'మీరెళ్ళి చూసి రండి. నాకు ఓపిక లేదు నవ్వడానికి' అని బజార్లో పడ్డాడు. అన్నాడేగాని నవ్వకుండా వుండలేకపోయాడు. ఒక కుర్రాడు అర్టిపండు ఒలిచి తింటున్నాడు. తిండం పూర్తయ్యాక తొక్కలు విసిరేశాడు. చిత్రం - ఒక పండుకి రెండు అరిటిపళ్ల తొక్కలుంటాయా - ఒక మనిషి రెండు కోట్లు తొడుక్కున్నట్లు - రంగనాధానికి ఆ అర్టిపండు తొక్కతీసి రోడ్డుమీద పోయే నలుగుర్నీ కేకేసి - యీ గమ్మత్తుని వివరించి చెప్పాలనుంది. ఏమో - ఇంటికెళ్లాక సుందరిని దగ్గరకూర్చోబెట్టుకుని చెప్పాలి



అమ్మవారికి మూడు సున్నాలు, అర్ది పండుకి రెండు తొక్కలు వున్న సంగతి – కాని ఛీ ఛీ అని మొహం పెట్టేస్తుంది. తెలివైనవాళ్ల నర్థంచేసుకోడానికి తెలివైనవాళ్లే వుండాలి – పెళ్లాలు పనికి రారు.

రంగనాథం బజార్లో నడుస్తున్నాడే కాని అతని మనసు అతని దగ్గర వుండకుండా కోతిలా గంతులేస్తోంది.

దారి మధ్యలో ట్రాఫిక్ కానిస్టేబుల్ రెండు టోపీలు పెట్టుకుని నోట్లో రెండు విజిల్సు పెట్టుకుని వూత్తున్నాడు. ఒక టోపీ ఒక విజిలు ట్రాఫిక్ కానిస్టేబులుకి చాలవా అనుకున్నాడు రంగనాథం. ఎవరూ అడగరేవిటనుకుని తను వెళ్ళి మెల్లగా అడిగాడు. వినిపించుకోకుండా పోలీసు చేత్తో కసిరేశాడు. రంగనాథం చేసేదిలేక ఇంకాస్త ముందుకు వెళ్లి లాంతరుస్తంభం అడ్డు రాగా తలెత్తి చూశాడు. రామాంజనేయయుద్ధం పోస్టరు కనపడింది. ఈ వాల్‌పోస్టరు వాడు ఆంజనేయస్వామికి రెండు తోకలూ, రావణుడికి పన్నెండు తలకాయలూ వేస్తాడా ? రంగనాథం మళ్లీ మళ్లీ లెక్కపెట్టాడు. ఎన్నిసార్లు లెక్కపెట్టినా రెండు తోకలూ – పన్నెండు తలకాయలూ వస్తున్నాయి. డైరెక్టరేవన్నా మార్చాడేమోనని కొంతసేపు అనుమానించాడు.

రంగవాధానికి చాలా కోపం వచ్చేస్తోంది. ఎవడి బుర్రన్నా బద్దలుకొట్టెయ్యాలనిపిస్తోంది. లోకంలో యింత అజ్ఞానం ఇంత అసందర్భం వుందేవిటనిపిస్తోంది. సరే వుందయ్యా – దీన్నెవడూ ప్రశ్నించదేవిటి ?

తెల్లారి లేచాక – అమ్మవారికి మూడు సున్నాలేవిటి ? పోలీసుకి రెండు టోపిలెందుకు ? ఆంజనేయ స్వామికి రెండు తోకలూ, రావణాసురుడికి పన్నెండు తలకాయలేవిటి ? ఏదో ఒకటి చేసెయ్యాల్చేసెయ్యాలనిపించింది రంగనాథానికి. అతను రోడ్డుమీద పోయేవారిని పిల్చి– 'ఇదిగో మాస్టారూ–రావణాసురుడి కెన్ని తలలు? హనుమంతుడికి ఎన్ని తోకలు?' అని అడిగి, వాళ్లు తెల్లబోతే వాల్‌పోస్టరు కేసి చూపించి లెక్కపెట్టందే కదలొద్దన్నాడు. వాళ్లు పది తలలంటే మళ్లీ లెక్కపెట్టమన్నాడు. అక్కడో పెద్ద గుంపు పోగయింది–మధ్యలో చెమటలు కక్కుకుంటూ రంగనాథం.

ఇంతలో 'హలో మిత్రమా' అంటూ విశ్వం ఆ గుంపులోకి జొరబడ్డాడు. విశ్వం రంగనాథం చాలా మంచి గొప్ప స్నేహితులు. విశ్వానికి రంగనాథాన్ని చూస్తే ముందు ఆశ్చర్యం తర్వాత భయం వేసింది. మనిషి పూనకం వచ్చినవాడిలా వున్నాడు. అందర్నీ అడిగినట్లుగానే విశ్వాన్నీ అవే ప్రశ్నలడిగాడు. సత్యం జవాబివ్వకుండా మనిషి వాలకం పరీక్షించి 'ఏం వాసనేంలేదే – ఇలా ఎందుకు మాట్లాడుతున్నాడు?' అని తన్ను తాను ప్రశ్నించుకుని రెక్క పుచ్చుకుని ఆ గుంపులోంచి బయటకు లాక్కొచ్చాడు. 'కాని, ఎందుకో మిజరబుల్‌గా వుందోయ్ లోపల'అన్నాడు రంగనాథం. 'నాకు అప్పుడప్పుడు అలాటి ఫీలింగొస్తూ వుంటుంది గురూ' అన్నాడు విశ్వం. ఇద్దరూ రిక్షా ఎక్కారు. 'మినీ బార్‌కి పోనియ్' అన్నాడు సత్యం. 'శ్రావణ మాసమోయ్, శ్రావణ శుక్రవారం. మా ఆవిడ అవీ యివీ బోల్డు చెప్పిందోయ్ తెమ్మని' అంటూ నసిగాడు రంగనాథం.

'ఏవిటి? శ్రావణ శుక్రవారం లేడీస్‌కేగాని మనకు లేదా ? వుండకూడదా ?' అన్నాడు విశ్వం.

'మనం కూడా సెలిబ్రేట్ చేద్దావంటావా?' అన్నాడు రంగనాథం.

'అదే గదా తాత్పర్యం.'

ఇద్దరూ మినీబార్ దగ్గర దిగారు. బార్ వాడు డోర్ తెరిచాడు. పైకెళ్లారు. అలా పైకి వచ్చినవాళ్ల కొందరు అక్కడా అక్కడా నక్షత్ర మండలంలో సత్పురుషుల్లా కూర్చున్నారు దూర దూరంగా. గ్లాసుల గలగలలు సోడాల బుసబుసలు ప్రారంభమయ్యాయి. వెనుక నుంచి అనవసరపు సంగీతం గోలగా వినిపిస్తోంది. రంగనాధం యధాప్రకారం మాట్లాడాలని ప్రయత్నిస్తున్నాడు. విశ్వం అతన్ని మాట్లాడనివ్వడంలేదు.

'మాట్లాడకపోతే మందెక్కువ లోపలికెళ్తుందోయ్' - అన్నాడు రంగనాధం.

'తప్పదు గదా - వెళ్తుంది మరి' అన్నాడు విశ్వం క్లుప్తంగా.

'ఇదిగో యీ పకోడీలు తిను' అని కొన్ని పకోడీలు చేతిలో పెట్టాడు విశ్వం.

మరి కొంత సేపయాక-

'మన కంట్రీలో అర్థంతా తగలడిందోయ్, విశ్వం. పార్వతీ దేవికి మూడు సున్నాలేవిటోయ్ ఆశ్చర్యం ?'

'అదంతేలే-వాళ్లు తల్చుకుంటే- మగ దేవుళ్ళక్కూడా సున్నాలు పెట్టేస్తారు.'

రంగనాధం, విశ్వం లోకం గురించి, అందులోని హెచ్చుతగ్గులు అవకతవకలు అజ్ఞానం గురించి చాలా సేపు వితర్కించి చెరో ఆరు గ్లాసులు ఖాళీచేశారు. చెరో పదిహేను సిగరెట్లు వూదేశారు.

'గురూ మనం తూలకూడదు.'

'ఛ ఛ'

'రిక్షాలో జాగ్రత్తగా వెళ్లగల్రా'

'హ్హ - డోంట్ వర్రీ'

ఇద్దరూ చెరో రిక్షా ఎక్కారు.

రంగనాధం సిగరెట్టు వెలిగించి రిక్షావాలాతో హస్కు ప్రారంభించాడు 'హరే బ్రదర్ - హనుమంతుడికి ఎన్ని తోకల్రా ?' వాడు మాట్లాడకుండా రిక్షా తొక్కుతున్నాడు.

'చెప్పరా రాస్కెల్ - చెబితే రూపాయిస్తాను. హనుమంతుడికి ఎన్ని తోకల్రా?'

'ఎన్నుంటాయండి ? ఒకటేనండి'

'పో తీసుకోపో రూపాయి'



'మనిల్లు నీకు తెల్సురా?'

'తెల్సండి. అర్నీ? మిమ్మల్ని మనవే గదండీ మోసుకెళ్లేది రోజూ -'

'ఆల్ రైట్-రావణాసురుడికి హెన్ని తలలు ?'

'పది బాబూ -'

'తీసుకో పో మరో రూపాయ్.'

'దిగండి. బాబూ-జాగర్తగా వెళ్లండి'

'ఇదుగోరా రెండ్రూపాయల నోటు'

'బాబూ ఇది రెండ్రూపాయలు కాదండి.'

'నీకు దగా చేస్తానుట్రా - అది రెండ్రూపాయల్ నోటు ! పట్టిగెళ్ళు'

'ఇది కొత్త ఇరవై రూపాయల నోటండీ బాబయ్యా - తీసుకోండి'

'వొద్దురా - రెండ్రూపాయ్ ఇరవై రూపాయ్ ఎలాగవుతుంది? అది రెండ్రూపాయ్ తీసుకో - నాకు మనసు బాగోలేదు.'

రిక్షావాడు వెళ్ళిపోయాడు. రంగనాధం టక టక మెట్లెక్కి మీద కెళ్ళి తలుపుమీద టకటక కొట్టాడు. సుందరి నిర్ఘాంతపోయి తలుపు తీసి - మళ్ళీ నిర్ఘాంతపోయి,

'పొద్దుననగా వెళ్లారు - ఇప్పుడా రావటం ? అక్కడే వుండిపోయారా ?'

'శ-శ-ఇవ్వాళ శ్రావణ శుక్రవారమ్ నేనూ శివం షావణ శుక్రవారం షేసుకున్నామ్-మగాళ్ళుకూడా షేవణశుక్రవారం షేసుకుంటే మీ కంతా మంచి అవుద్దిట.'

'సరి - లోపలికి రండి, చెప్పులేవి ? కళ్ళజోడు ఏది ?'

'ఏమోనే - మాయాబజార్లో ఎక్కడొదిలేషానో...'.